డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా భీమరాజు

మన్సూరాబాద్, మే 15: నాగోల్ డివిజన్ పరిధి ఎరుకల నాంచారమ్మకాలనీలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయాల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించి నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. అధ్యక్ష ఎన్నికలకు ముగ్గురు పోటీ పడ్డారు. గుంజ బాలరాజు, గండికోట భీమరాజు, జగన్నాథం గంగయ్య మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల్లో 200 మంది ఓటర్లు ఉండగా.. 191 ఓట్లు పోలయ్యాయి. గుంజ బాలరాజుకు 58 ఓట్లు.. గండికోట భీమరాజుకు 91 ఓట్లు, జగన్నాథం గంగయ్యకు 42 ఓట్లు వచ్చాయి. గండికోట భీమరాజు 33 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయాల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గండికోట భీమరాజు మాట్లాడుతూ రెండోసారి తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కాలనీవాసులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

యువతి అదృశ్యం

భవానీ (ఫైల్)

సైదాబాద్, మే 15 : యువతి అదృశ్యమైన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రీన్ పార్క్ కాలనీ రోడ్డు నంబర్ 3లో నివసించే కనుకుంట్ల రేణుక జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికురాలు. ఆమె కుమార్తె భవాని (23), కుమారుడు ఉన్నారు. కర్మన్‌ఘాట్‌లోని ఓ దుకాణంలో పనిచేసే భవాని ఈనెల 7న ఉదయం ఇంటి నుంచి డ్యూటీకి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పలు చోట్ల వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేందర్ తెలిపారు.

శ్రీపురం కాలనీలో మార్చిలో నిర్మాణంలో ఉన్న షెడ్డును కూల్చివేస్తున్న దృశ్యం, అదే షెడ్డు నిర్మాణం పూర్తయిన ప్రస్తుత దృశ్యం

నువ్వు కొట్టినట్లు చెయ్...

జేసీబీ తెచ్చి కూల్చినట్టు చేసి.. సెటిల్మెంట్ చేసుకొని వెళ్లిపోతారు

అక్రమ నిర్మాణాల కూల్చివేతల పేరుతో టౌన్ ప్లానింగ్ అధికారుల డ్రామాలు

నేను ఏడ్చినట్లు చేస్తా

వనస్థలిపురం, మే 15: 'నువ్వు కొట్టినట్లు చెయ్... నేను ఏడ్చినట్లు చేస్తా'ను అనే సామెతను తలపిస్తుంది జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పనితీరు. హయత్‌నగర్ సర్కిల్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో ఇది స్పష్టంగా ప్రస్ఫుటమవుతున్నదది. డివిజన్ నిండా అక్రమ నిర్మాణాలు కో కొల్లలు ఉన్నా, ఎన్ని ఫిర్యాదులు వచ్చినా టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కనీసం పట్టించుకోరు. కానీ తాము పనిచేసినట్టు రికార్డుల్లో చూపుకునేందుకు మాత్రం ఒకట్రెండు సార్లు జేసీబీనీ తీసుకుని వస్తారు. ఒకట్రెండు నిర్మాణాలను చూసుకుంటారు. గోడకు ఓ రంధ్రం లాగా చేసి.. అదే కూల్చివేత అన్నట్టు డ్రామా చేస్తారు. సెటిల్‌మెంట్ చేసుకొని వెళ్లిపోతారు. ఆ తర్వాత రెండ్రోజులకే అదే చోట తిరిగి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. శరవేగంగా పూర్తవుతుంది కూడా.

ఇలా కూల్చారు.. అలా కట్టారు

సాగర్ రహదారి శ్రీపురం కాలనీ సమీపంలో ఓ పెద్ద వాణిజ్య షెడ్డు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుంది. దానిపై కాలనీవాసులు, కార్పొరేటర్ కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో 'బల్దియా ఆదాయానికి గండి' పేరుతో మార్చి 28న నమస్తే తెలంగాణలో కథనాన్ని ప్రచురించడం జరిగింది. దానికి స్పందించిన అధికారులు మార్చి 31న స్వల్పంగా కూల్చివేశారు. ఆ తర్వాత 10రోజుల పాటు పనులు ఆపిన నిర్మాణదారులు, ప్రస్తుతం షెడ్డు పనులు పూర్తి చేశారు. కనీస అనుమతులు లేని షెడ్డును ఎలా పూర్తి చేశారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనివెనుక టౌన్ ప్లానింగ్ చైన్‌మెన్, సెక్షన్ అధికారుల చేతివాటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వైదేహీ నగర్ ప్రధాన రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణంలో ఉన్న వాణిజ్య భవనం

కోకొల్లలుగా ఫిర్యాదులున్నా స్పందించేది ఒకట్రెండింటికే

బీఎన్‌రెడ్డినగర్‌లో చక్రం తిప్పుతున్న చైన్‌మెన్‌లు

ఇంతలోనే ఎంత మార్పు...

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అక్రమ నిర్మాణాలపై చిన్న ఫిర్యాదు వెళ్లినా వెంటనే స్పందించిన ఇదే అధికారులు ఇప్పుడు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. 5నెలలు పూర్తి కాకముందే స్పష్టమైన తేడా తెలుస్తుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. సాహెబ్‌నగర్ శివారులోని సౌభాగ్యనగర్ కాలనీలో ఏకంగా రాచకాల్వపై యథేచ్ఛగా ఇండ్లు నిర్మాణం సాగిస్తున్నారు. పదులు సంఖ్యలో ఫిర్యాదులు వెళ్లినా కనీసం పట్టించుకోని అధికారులు, ఇరిగేషన్ శాఖపై నెడుతూ తప్పించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. అనుమతులు నిషేధం ఉన్న వైదేహినగర్, ఎస్కేడినగర్ కాలనీల్లో ప్రధాన రహదారుల పక్కన బహుల అంతస్తుల నిర్మాణాలు నిరిస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహించే సిబ్బంది, అధికారులు చిన్న కాలనీల్లో చిన్న ఇండ్లు కట్టుకునేవారిపై మాత్రం తమ ప్రతాపం చూపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తమకు అందాల్సింది అందితే ఎంతటి అక్రమాన్నయినా పట్టించుకోరని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా బీఎన్‌రెడ్డినగర్ టౌన్ ప్లానింగ్ అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని, ఉన్నతాధికారులు వీరి పనితీరుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గల్లీ గల్లీలో గంజాయి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట, మే 15: గల్లీ గల్లీలో గంజాయి దందా జోరుగా సాగుతోందని.. గంజాయిని నిలువరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందుతోందని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ ఆరోపించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గంజాయి మత్తులో యువత భవిష్యత్ చిత్తు అవుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నారని.. చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారని ఆరోపించారు. ఏ బస్తీల్లో చూసినా పేదల పిల్లలు గంజాయి బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు లేని గ్రామాలు ఉన్నాయి కానీ.. గంజాయి లేని గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదన్నారు. పోలీసులు గంజాయిని నిలువరించడానికి ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయడం లేదన్నారు. పోలీసులకు సమాచారం వస్తే అడప దడపా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారని చెప్పారు. మీర్‌పేట, బాలాపూర్, పహాడీషరీఫ్, ఆబట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయిని నిలువరించడానికి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయించాలన్నారు. యువత గంజాయితో చెడు మార్గంలో పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మత్తులో ఏం చేస్తున్నారో వారికి తెలియదన్నారు. ఇకనైనా పోలీసులు గంజాయి విక్రయ దారులపై ఉక్కుపాదం మోపాలన్నారు. యువత భవిష్యత్‌ను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

ఇంటర్నేషనల్ నర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వైన్ ఓవెన్, సత్యసాయి ప్రసాద్

ఆర్కేపురం, మే 15 : నర్సుల సేవలు మరువలేనివని ఓజోన్ హాస్పిటల్స్ ఎండీ. బీవీ సత్యసాయి ప్రసాద్ తెలిపారు. ఇంటర్నేషనల్ నర్సుడ్ డే సందర్భంగా బుధవారం ఆర్కేపురంలోని ఓజోన్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వైన్ ఓవేన్ ముఖ్య అతిథిగా హాజరై నర్స్‌లకు సర్వైకల్ క్యాన్సర్ ప్రివెన్షన్ ఫ్రీ వ్యాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉంటేనే అందరికీ మంచిదన్నారు. గర్భాశయం ముఖ ద్వారానికి సంబంధించిన వ్యాధి 30 సంవత్సరాల పైబడ్డ వారికి వస్తుందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రాకుండా అరికట్టవచ్చన్నారు. గర్భాశయ క్యాన్సర్‌పై అందరికీ అవగాహన ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మిస్ దీప్తి, డాక్టర్. ఇంద్రసేనారెడ్డి, డా.పూజిత, డా. సీహెచ్ శ్రీనివాస్‌రావు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలి

మాట్లాడుతున్న ప్రతినిధి వనిత వోసుదేవ్

మణికొండ, మే 15: యువతలో సృజనాత్మకత, ఆవిష్కరణలో పోటీతత్వం పెంపొందించడమే లక్ష్యంగా పని చేయాలని ఐఐటీ ఢిల్లీ ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ప్రతినిధి వనిత వోసుదేవ్ అన్నారు. గండిపేట్‌లోని మహాత్మగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన వాతావరణం, సుస్థిరత అంశంపై సమావేశం జరిగింది. సాల్వ్ ఫర్ టుమారో సెన్సిటైజేషన్ సెషన్‌లో వనిత మాట్లాడుతూ.. సాంసంగ్ ఇండియా విద్యార్థుల్లోని ఆవిష్కరణల స్ఫూర్తికి వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, సంస్థ ప్రతినిధి అరుణ రాజ్, రంజిత్‌సింగ్, ముస్కాన్, వెంకట్‌రెడ్డి, మాధవి, ప్రవీణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

మైలార్‌దేవ్‌పల్లి, మే 15: అప్రమత్తతతో ప్రమాదాలను నివారించవచ్చని నవ యువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఉడ్డంగడ్డ జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో ఏజెన్సీ రెస్క్యూ టీం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు, భారీ వర్షం, ఈదురు గాలులు వల్ల జరిగే ప్రమాదాల గురించి గ్రౌండ్‌లో అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, పరిష్కార మార్గాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి ప్రమాదాలు జరిగిన సమయంలో అప్రమత్తంగా ఆలోచించి నివారణకు చర్యలు తీసుకోవడం ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ఏజెన్సీ సిబ్బంది

తవ్వారు.. వదిలేశారు

బడంగ్‌పేట ప్రధాన కుడలిలో మరమ్మతుల పేరుతో గోతులు తీసి వదిలేసిన దృశ్యం

బడంగ్‌పేట, మే 15: బడంగ్‌పేట ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై రహదారి విస్తరణ పేరుతో అధికారులు మధ్యన డివైడర్ ఏర్పాటు చేశారు. దీంతో ఒక వాహనం వెళ్తే మరో వాహనానికి వీలుండదు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఇటీవల డ్రైనేజీ, మంచి నీళ్ల పైపులకు మరమ్మతులు చేయడానికి బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది గోతులు తీసి వదిలేశారు. ఏకంగా ప్రధాన రహదారిపై మూడు చోట్ల గోతులు తీశారు. చిన్న చిన్న జెండాలు పాతి తమ పని అయిపోయిందని చేతులు దులుపుకొన్నారు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలు

అమ్మవారికి పుష్పాభిషేకం నిర్వహిస్తున్న పురోహితులు

ఆర్కేపురం, మే 15 : కొత్తపేట వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రాబోధిక అష్టోత్తర శత కలశాభిషేకం (108 వెండి కళశములతో) అలంకరణ, రాజ భోగ నివేదన, శాత్తుమురై, కుంభ ప్రోక్షణ, తీర్థ ప్రసాదగోష్ఠి, బుత్విక్ సన్మానం, చిన్నరథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేశ్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి ఐత అంజయ్య, వైస్ చైర్మన్ నాగమల్ల శ్రావణ్ కుమార్, మ్యాడం సుధాకర్, బంధం దామోదర్, బొగ్గరపు రవీంద్ర కుమార్, అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, ఉమాపతి, గౌరీశంకర్ తదితరులు ఉన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

చర్లపల్లి, మే 15: ప్లాస్టిక్ రంగంలోని శిక్షణ తరగతులను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు పేర్కొన్నారు. చర్లపల్లి పారిశ్రామిక వాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలాజీ(సీపెట్)లో ఎన్టీపీసీ సహకారంతో నిర్వహించిన ఆరు నెలల శిక్షణ తరగతులను ఆయన సీపెట్ హెడ్, చీఫ్ మేనేజర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యుగంలో ప్లాస్టిక్ రంగం కోర్సులకు అధిక డిమాండ్ ఉందని, సీపెట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గతంలో ఎన్టీపీసీ సహకారంతో శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించామని ఆయన గుర్తు చేశారు. సీపెట్ చీఫ్ మేనేజర్ డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సీపెట్‌లో నిరుద్యోగ యువతీయువకులకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.అనంతరం గతంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎన్టీపీసీ హెడ్, హెచ్ఆర్ విజయ్‌కుమార్ సిక్దార్, ఎన్టీపీసీ అధికారులు యోగేంధర్ రావు, సుందర్, సీపెట్ అధికారులు అంజనేయశర్మ, శ్రీకార్, మణికందన్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



సీపెట్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు శిక్షణ సామగ్రిని అందజేస్తున్న అధికారులు

మాట్లాడుతున్న విద్యాభారతి దక్షిణ క్షేత్ర కార్యదర్శి లక్షణరావు

శారదధామంలో ఆచార్యులకు శిక్షణ

బండ్లగూడ, మే 15: విద్యారంగానికి అంత్యత ప్రధాన్యత ఉన్నదని, విద్యతోనే సమాజం బాగుపడుతుందని విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి అయాచితుల లక్ష్మణరావు పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీశారద ధామంలో నూతన ఆచార్యులకు శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, ఆచార్యులను ఉద్దేశించి మాట్లాడారు. శిశు మందిర్‌లో బోధించే ఆచార్యులు విషయ పరిజ్ఞానంతో పాటు సమగ్ర వికాసం కలిగే విధంగా యోగ, కళాత్మక అంశాలు, వ్యాయామంతో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థికి భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మిణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సరస్వతి విద్యా పీఠం ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ నీలిమ, సరస్వతి విద్యా పీఠం తెలంగాణ అకాడమిక్ ఇన్‌చార్జి కృష్ణమాచార్యులు, నూతన ఆచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న లక్ష్మారెడ్డి

కందుకూరు, మే 15 : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ గ్రామానికి చెందిన ఊటు ప్రేమ్‌కుమార్ పూణెలో జరిగే కిక్ బాక్సింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో ఆడడానికి వెళ్లడానికి ఆయ్యే ఖర్చులు భరించలేక పోతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి.. ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, సీనియర్ నాయకులు ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, వెంకట్‌రాంరెడ్డి, వీరారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, జగదీశ్, నర్సింహ, కుమార్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

మన్సూరాబాద్, మే 15: మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆదిత్యనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మండల పూజలను భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. దీంతో పాటు 108 కలశాలతో స్వాములకు అభిషేకాలు, మండల మూలమంత్ర హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ టి.మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ టి. సంతోషికుమారి, సభ్యులు రవికుమార్, వీఎస్ఎన్ మూర్తి, ఎన్‌వీఆర్ నాగరాజు, కృష్ణమూర్తి, జాల శ్రీధర్, అర్చకులు కొండలాచార్యులు, డాక్టర్ శ్రీధరాచార్యులు పాల్గొన్నారు.